క్లుప్తంగా

అదునులోనే విత్తుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : జూలై నెలాఖరు వరకు పంటలు సాగు చేసేందుకు సమయం ఉన్నందున రైతులు అరకొర వర్షాలకు పంటలను సాగు చేయకుండా, బాగా వర్షాలు కురిసిన తర్వాతనే విత్తనాలు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవి ప్రకాష్ సూచించారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అలాగే రైతులతో సమావేశమయ్యారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు, మందులు వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.

కారుణ్య నియామకం

కర్నూలు (న్యూటౌన్): జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశాల మేరకు కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో సబ్ ఆర్డినేట్‌గా వి. సామశ్రీభవానిని నియమించినట్లు కర్నూలు ఎంపీడీఓ కేపీ అజాంఖాన్ తెలిపారు. బుధవారం కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. సౌమ్యశ్రీ భవాని తండ్రి హరికృష్ణ నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ అకాల మరణం చెందారు. కారుణ్య నియామకంలో భాగంగా కర్నూలు ఎంపీడీఓ కార్యాలయంలో సబ్ ఆర్డినేట్‌గా నియమించినట్లు ఆయన స్పష్టం చేశారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం ఎన్ ప్రసాద్

పాణ్యం: పొదుపు మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీపీ ఉసేన్‌బీ అన్నారు. బుధవారం పాణ్యంలోని పొదుపు కార్యాలయంలో ఉన్నతి, స్త్రీ నిధి రుణాలపై గ్రామ సంఘాల అధ్యక్షులు, వీఓఏలతో ఏపీఎం ఏఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ గ్రామైక్య సభ్యులు, సంఘాల వారు ఏదైన జీవనోపాధి ఏర్పాటు చేసుకుంటే వారికి ఉన్నతి, లేదా స్త్రీ నిధి కింద రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలతో వారు ఆర్థిక అభివృద్ధి చెందడమే కాకుండా, ఇతరులకు ఉపాధి కల్పించవచ్చారు. కార్యక్రమంలో ఏసీఓ బాబురావు, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ అధికారులు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సరళమ్మ, సీసీలు రఘురామ్, పుల్లన్న, బాలస్వామి, మేరీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న స్పెషలాఫీసర్ జేడీ రంగాలక్ష్మీదేవి

కోడుమూరు : మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాలపై మండల స్పెషలాఫీసర్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగాలక్ష్మీదేవి బుధవారం మండల అధికారులతో సమీక్షించారు. జేడీ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరై నిర్మాణాలు మొదలు పెట్టుకోని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పనులు ప్రారంభించుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ శరభయ్య, పీఆర్ ఏఈ గంగరాజు, డీటీ రామాంజినేయులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

పాణ్యం: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వద్ద కారు అదుపు తప్పి హైవే రోడ్డు నుంచి కిందకు దూసుకెళ్లింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. బుధవారం హైదరాబాద్ నుంచి నంద్యాలకు వస్తున్న ఓ కారు అదుపుతప్పి హైవే నుంచి కింద ఉన్న చెట్ల వద్దకు దసూకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికి గాయాలు కాలేదని, వాహనాన్ని బయటకు తీసి పంపించినట్లు పెట్రోలింగ్ సిబ్బంది తెలిపారు.

వైద్యుల తీరు మారకపోతే చర్యలు

కర్నూలు (హాస్పిటల్): క్యాజువాలిటీ, ఏఎంసీ విభాగాల్లో పనిచేసే డ్యూటీ డాక్టర్లు తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన అనస్తీషియా, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఎంసీ, క్యాజువాలిటీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అక్కడ అసోసియేట్ ప్రొఫెసర్లు, పీజీలు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అనస్తీషియా, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీలు ఏఎంసీ, క్యాజువాలిటీలలో డ్యూటీ డాక్టర్ల రోస్టర్‌ను తమకు పంపాలన్నారు. ఈ మేరకు వైద్యుల విధి నిర్వహణపై పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.

వారం రోజుల్లోనే పని పూర్తి



నాపేరు కుంచపు శ్రీనివాసులు. నాకు గడివేముల మండల పరిధిలోని ఆళ్లగడ్డ పొలిమేరలో 3.76ఎకరాల పొలం ఉంది. కొన్ని రోజుల నుంచి 1బీ రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాను. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మా ఇంటి వద్దకు అధికారులు వచ్చారు. నా సమస్యను అధికారులకు తెలియజేశాను. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. సచివాలయం 2 వద్ద జరిగిన కార్యక్రమంలో 1బీ అందజేశారు. కొన్ని రోజులుగా ఉన్న సమస్యను వారం రోజుల్లో పరిష్కరించిన సీఎం జగనన్న కృతజ్ఞతలు.

ఏ అధికారి చుట్టూ తిరగలేదు



నాపేరు అంచ కాత్యాయని. మేము గడివేములలో నివాసముంటాము. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ రోజూ తిరగాల్సి వచ్చేది. అప్పుడు రా.. సాయింత్రం రా.. అంటూ కాలం వెళ్లదీసేవారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి వలంటీర్ వ్యవస్థతో ప్రతి పని ఎంతో సులువైంది. అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా పోయింది. జగనన్న సురక్ష పథకంలో భాగంగా బుధవారం కుల, ఆదాయ ధ్రువీక రణ పత్రాలు పైసా ఖర్చు లేకుండా దరఖాస్తు చేసిన రోజే ఇచ్చారు.

‘జగనన్న సురక్ష’తో లబ్ధిదారుల్లో సంతోషం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- ఈ తాండ్రపాడు, పసుపుల, కల్లూరులో జగనన్న సురక్ష కార్యక్రమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి.



పసుపులలో లబ్ధిదారురాలికి కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): జగనన్న సురక్షతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు, పసుపుల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూల బొకేలు, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ. తాండ్రపాడు, పసుపుల గ్రామ సచివాలయాల పరిధిలో సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. ఈ తాండ్రపాడు గ్రామంలో 373, పసుపుల గ్రామంలో 240 మంది లబ్ధిదారులకు కుల, ఆదాయ, కౌలు, మ్యారేజ్ సర్టిఫికెట్లను అందజేశామరు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు బాలపీర, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు

గూడూరు: ‘జగన్న పాలనలో ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సచివాలయం–2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలలకు తరుబడి తిరిగే వారని, జగనన్న సీఎం అయ్యాక ఈ విధానానికి స్వస్తి పలికారన్నారు. వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ పథకాలు అందజేసేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. జగనన్నకు మరో సారి అవకాశం ఇచ్చి రుణం తీర్చుకుందామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనతరం పలువురికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం–2 పరిధిలో నేడు 203 మందికి సేవలు అందించామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం

కల్లూరు: అర్హులై ఉండి పథకాలు రాని వారిని గుర్తించి పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారని దీంతో అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు 45వ వార్డు సచివాలయం ఇందిరమ్మ కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అప్‌లై చేసుకున్న వారికి పైసా ఖర్చులేకుండా ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేయడంతో పాటు అర్హులైన వారందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాం స్వామి, నాగరాజు పాల్గొన్నారు.

గడివేముల: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరినీ జల్లెడ పట్టి మరీ గుర్తించి సంక్షేమ పథకాలను, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నట్లు గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన గడివేముల సచివాలయం –2లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన తొలి రోజు నుంచి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. 99 శాతం మందికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించామన్నారు. సాంకేతిక పర మైన కారణాలతో అందని ఒక శాతం వారిని గుర్తించి లబ్ధి చేకూర్చాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ అబ్దుల్ ఖాలిక్, ఉప సర్పంచ్ బాలచెన్ని, ఏపీఓ వెంకట రమణ పాల్గొన్నారు.



గడివేముల సచివాలయం 2 లో ఉచితంగా ధ్రువపత్రాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

నేడు ‘జగనన్న సురక్ష’

కోడుమూరు రూరల్ : మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో గురువారం మధ్యాహ్నం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు.

సి.బెళగల్: మండలం పరిధిలోని రెండు గ్రామాలలో గురువారం జగనన్న సురక్షా కార్యక్రమంపై సదస్సులను నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రాముడు తెలిపారు. గురువారం ఉదయం 11:30 గంటలకు మండలంలోని కొండాపురం గ్రామంలో తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్‌ల ఆధ్వర్యంలో, ఉదయం 10:30 గంటలకు ముడుమాల గ్రామంలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తుల ఆధ్వర్యంలో ఆయా గ్రామ సచివాలయాలలో సదస్సులను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 6న తేదీన గురువారం సాయంత్రం 5 గంటలకు అంబేడ్కర్ నగర్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ కేపీ అజాంఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు.

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని గ్రామ సచివాలయం–3 పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని హాజరవుతారన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, మండల స్థాయి ఉద్యోగులు పాల్గొనాలన్నారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం సుంకేసుల గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ కేపీ అజాంఖాన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు.

ప్రతి గడపకు లబ్ధి చేకూరింది



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం కల్లూరు అర్బన్ 29వ వార్డు, సాయంత్రం రెమడూరు గ్రామంలో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు, ఎంపీపీ బోయ శారదకు నాయకులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను సకాలంలో అందిస్తున్నారా?లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సీసీ రోడ్లు, డ్రైనేజి కాలువలు ఏర్పాటు చేయాలని సమస్యలను తెలియజేశారు. సమస్యలను సకాలంలో పరిష్కారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చంద్రబాబును నమ్మి మోసపోవద్దు

ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ నాయకుడు చంద్రబాబు ఇచ్చే అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఒకటి కూడా అమలు చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను పార్టీలకు, రాజకీయాలకు, మతాలకు, కులాలకు, వర్గాలకు అతీతంగా అర్హులై వారందరికీ అందిస్తున్నారన్నారు. చెప్పిన వాటితో పాటుగా చెప్పనివి కూడా అమలు చేస్తున్నారని, మరో మారు జగనన్నను, తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రియాంక, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి గ్రామ నాయకులు నారాయణరెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష షెడ్యూల్ ఖరారు

పాణ్యం: ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబధించి మండలంలో షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఎంపీడీఓ దస్తగిరి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అధికారులు రెండు బృందాలుగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు టీమ్–1లో తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఈఓఆర్డీ భాస్కర్‌రావు, ఎన్నికల డీటీ అనురాధ, టీమ్ –2: ఎంపీడీఓ దస్తగిరి, ఎంపీడీఓ ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ బషీర్, ఆర్‌ఐ మహేశ్వర రెడ్డి ఉంటారు. వీరు ఆయా గ్రామాల్లో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం శిబిరం నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేస్తారు.

తేదీ	టీమ్–1	టీమ్–2
18న	బలపనూరు	భూపనపాడు
20న	కొండజుటూరు	గోరుకల్లు
22న	కౌలురు–1	కౌలురు–2
25న	తమ్మరాజుపల్లె	కందికాయపల్లె
27న	నెరవాడ	మద్దూరు
28న	సుగాలిమెట్ట	ఎస్. కొత్తూరు

ప్రస్తుతం పాణ్యం–1, 2, సచివాలయాల్లో రెండు టీమ్‌లు కలిసి కార్యక్రమాలు చేపట్టాయి. అలాగే సచివాలయం–3, 4, కొణిదేడు, గోనవరం, ఆలమూరు గ్రామాల్లో కూడా ఈ రెండు బృందాలు కలిసి కార్యక్రమాలు చేపడతాయన్నారు. వలంటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల భూములకు పట్టాలు ఇవ్వాలి

సి.బెళగల్: మండలంలో బంజరు భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలివ్వాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యవర్గ సభ్యుడు మోహన్ కోరారు. బుధవారం వారు మండలంలోని తిమ్మందొడ్డి వాసులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం చేరుకుని కార్యాలయ అధికారి మధుకు వినతి పత్రం ఇచ్చారు. మండలంలోని గ్రామాలలో ప్రభుత్వ భూములను కొంతమంది అనుభవంలో ఉంటూ పంటలు సాగు చేసుకుంటున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం హక్కు పత్రాలను ఇవ్వాలని కోరారు. తిమ్మందొడ్డి గ్రామంలో 20 మంది పేదలు ప్రభుత్వ భూములపై హక్కులకు దరఖాస్తులు చేసుకుంటే కొంతమందికి మాత్రమే అధికారులు అనుమతులు ఇచ్చారని, మిగిలిన వారందరికి పట్టాలివ్వాలన్నారు. బడేసావ్, ఆదిలక్ష్మి, శేఖర్, వెంకటేష్, లక్ష్మన్న, వీరేష్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కలెక్టర్ డాక్టర్ జి.సృజన హామీ ఇచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక వసతుల కల్పనపై సీడీపీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 360 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, 151 కేంద్రాల్లో నీటి కుళాయిలు, 306 కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. మరో 81 కేంద్రాల్లో నాడు–నేడు కింద పనులను చేపట్టామని వివరించారు. టీచర్లు, ఆయాల పోస్టులు భర్తీ చేస్తున్నామని, వంట పాత్రలు, ఇతర సామగ్రి, చిన్నారుల బరువు చూసే పరికరాలను కొనుగోలు చేసి పంపుతామన్నారు. సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకపోతే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



గూడూరులో అమ్మ ఒడి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు: విద్యార్థులందరూ బాగా చదువుకుని గొప్ప స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే సుధాకర్ సూచించారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ‘జగనన్న అమ్మ ఒడి’ కార్యక్రమం హెచ్‌ఎం సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాక్షించారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అమలుచేస్తున్న పథకాలు, సంస్కరణలను వివరించారు. అనంతరం జగనన్న అమ్మ ఒడి చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లాం, బోయ లక్ష్మన్న, ఎంపీడీఓ మాధవీలత, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ఎంఈఓ–2 నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే వైఎస్సార్‌సీపీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ స్పష్టం చేశారు. ఆయన బుధవారం కోడుమూరు బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ వాసులు మాట్లాడుతూ.. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరగా ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని పీఆర్ ఏఈ గంగరాజు, ఎంపీడీఓ చంద్రశేఖర్‌లకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్–5లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భిణులకు సామూహిక శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంపై వివరించారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పారదర్శక పాలన అందిస్తున్న జగనన్నను ప్రజలంతా మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఈఓ అజయ్‌భాస్కర్, స్థానిక నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ప్రభాకర్, మధుమోహన్‌రెడ్డి, షాకీర్‌బాషా, బలరాం పాల్గొన్నారు.

వీధి బాలలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: వీధి బాలలను బడిలో చేర్పించాలని మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా బడిబయటి పిల్లలను గుర్తించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మండలంలో ఇప్పటివరకు 700 మంది బడిఈడు పిల్లలను గుర్తించినట్లు ఎంఈఓ సునంద తెలిపారు. వారందరినీ ఈ నెల 15వ తేదీ లోగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అలాగే మనబడి నాడు–నేడు పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో అన్ని సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓలు సునంద, ఓంకార్‌యాదవ్, హౌసింగ్ ఏఈ రామయ్య, వివిద పాఠశాలల హెచ్‌ఎంలు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

ఓర్వకల్లు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం సోమయాజులపల్లె వద్ద జరుగుతున్న ఫీడర్ ఛానల్‌లో పూడికతీత పనులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ రోజుకు రూ.272 వేతనం వచ్చేలా పనిచేయాలన్నారు. అనంతరం హుసేనాపురం వద్ద జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఏపీఓ కుమార్‌సాయినాథ్, టీఏ శాంతి ఉన్నారు.

అనాలోచిత చర్యలతో అవస్థలు



బురదమయంగా మారిన చింతమానుపల్లె రోడ్డు

సి.బెళగల్: మండలంలోని చింతమానుపల్లె గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారండతో బుధవారం ఆ గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు చాలావరకు దెబ్బతినడంతో ఆటో డ్రైవర్లు అనాలోచితంగా రోడ్డుపై పక్కనున్న నల్లరేగడి మట్టి వేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నల్లరేగడి మట్టి పూర్తిగా చిత్తడిగా మారడంతో అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. బుధవారం ఉదయం సి.బెళగల్ నుంచి పొల్లాలో విత్తనాలు విత్తుకునేందుకు బయలుదేరిన రైతులు వెళ్లేందుకు వీల్లేక తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రజలు నడిచేందుకు సైతం వీలులేక పోగా, కాడెద్దులు, బండ్లు రోడ్డుపై ఇబ్బందులు పడుతూ పొలాలకు వెళ్లగా, స్కూటర్లు, ఆటోలు, ఇతర వాహనాల పరిస్థితి మరింత దారుణంగా మారింది. రోడ్డు మధ్యలో ఆటోలు, స్కూటర్లు ఇరుక్కుపోవడంతో మధ్యాహ్నం వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆటో డ్రైవర్ల తీరుపై ప్రజలు మండిపడుతూ, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయండి



కేజీబీవీలో బాలికలతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారిణి శ్యామల, ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగునంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. బుధవారం ఎంపీడీఓ రాముడుతో కలిసి మండలంలోని పోలకల్, సి.బెళగల్ గ్రామాలలో పర్యటించారు. మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో అంగర్‌వాడీ కేంద్రం – 7ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహణ తీరుపై మండిపడ్డారు. అంగన్‌వాడీ కార్యకర్తకు పలు సూచనలు చేసి, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అదే విధగా గ్రామంలోని 3వ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. సి.బెళగల్‌లోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని సందర్శించి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులతో సమావేశం నిర్వహించి బాలవివాహాలు, బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్ అసిస్టెంట్లతో గ్రామాలలో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సమీక్షలో ఈఓఆర్డీ సందీప్ ఉన్నారు.

నాడు–నేడు పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న జిల్లా నాడు–నేడు పరిశీలకులు బుగ్గయ్య

పాణ్యం: నాడు–నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిల్లా నాడు–నేడు పర్యవేక్షకులు బుగ్గయ్య ఆదేశించారు. ఆయన బుధవారం పాణ్యంలోని పలు పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతలో రాజీపడొద్దని పాఠశాలల సిబ్బందికి సూచించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. పనుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. పలు పాఠశాలల్లో సరైన కొలతలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.